VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
MOBILE: 9494498787,9440232308.

www.vibharenews.com

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 17-05-2023 సంపుటి : 04 సంచిక : 227 పేజీలు : 4 వెల : రూ 3-00

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్లపై నిప్పులు చెరిగిన సీఎం జగన్



బాపట్ల: నిజాంపట్నం మత్స్యకార భరోసా సభ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష టీడీపీ, జనసేనపై నిప్పులు చెరిగారు.చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు పొలిటికల్‌గా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎన్నికలప్పుడే చంద్రబాబాకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు గుర్తొస్తారని ధ్వజమెత్తారు. బాబు, తన దత్తపుత్రుడు నమ్ముకున్నది పొత్తులు, కుయుక్తులనేనని విమర్శించారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు పేరు చెబితే ఒక్కపథకం గుర్తు రాదని.. ఆయన పేరు తలిస్తే గుర్తుకొచ్చేది వెన్నుపోటేనని అన్నారు. పేదలకు మంచి చేయని ఈ వ్యక్తికి ఎవరైనా ఎందుకు మద్దతు ఇస్తారని ప్రశ్నించారు.చంద్రబాబు అధికారంలో ఉంటే అమరావతి.. అధికారం పోతే జూబ్లీహిల్స్‌లో ఉంటాడని సీఎం జగన్ దుయ్యబట్టారు. ఏపీలో దోచుకుని హైదరాబాద్‌లో ఉండటం వీరి పని అని మండిపడ్డారు. అయితే ఏపీలోనే తన శాశ్వత నివాసం ఉందని.. తాడేపల్లిలో ఇళ్లు కట్టుకొని ఉంటున్నట్లు సీఎం పేర్కొన్నారు. ప్రధానులు, రాష్ట్రపతులను చేశానన్న పెద్ద మనిషికి ఒంటరిగా బరిలోకి దిగే దమ్ముందా? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా చంద్రబాబుకు లేదని విమర్శించారు. చంద్రబాబుకు సభలు పెట్టే ధైర్యం కూడా లేదని, ఆయన పార్టీ వెంటిలేటర్‌పై ఉందని ఎద్దేవా చేశారు.సీఎం పదవి వద్దు, దోపిడిలో వాటా చాలు..'రెండు చోట్ల పోటీచేస్తే.. మాకు ఎమ్మెల్యేగా వద్దని రెండు చోట్లా కూడా దత్తపుత్రుడ్ని ప్రజలు ఓడించే పరిస్థితి. 10 ఏళ్లుగా రాజకీయ పార్టీ పెట్టిన దత్తపుత్రుడు 175 చోట్ల అభ్యర్థులను పెట్టలేని పరిస్థితిలో ఉన్నాడు. నాకు సీఎం పదవి వద్దు.. దోపిడీలో వాటా చాలని దత్తపుత్రుడు అంటున్నాడు. గజదొంగల ముఠాగా దోచుకోవడానికి వీరంతా కలుస్తున్నారు. వీళ్లంతా ఎందుకు కలుస్తున్నారో ప్రజలు ఆలోచించాలి.ఎన్ని వ్యవస్థలను నాపై ప్రయోగించినా 15 ఏళ్లుగా ఎక్కడా రాజీపడలేదు. ప్రజల తరపున నిలబడ్డా.. మంచి చేస్తున్నా. మీకు మంచి జరిగితే మీ బిడ్డకు తోడుగా నిలవండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధానమంత్రి, రాష్ట్రపతిని కలిస్తే చాలు నాపై దుష్ప్రచారం చేస్తారు. బీజేపీ, కాంగ్రెస్‌తో అంటకాగిన



వాళ్లు నన్ను విమర్శిస్తున్నారు. పొత్తులు పెట్టుకొని.. తెగదెంపులు చేసుకునేది వీళ్లే.. వివాహాలు చేసునేది వీళ్లే.. విడాకులు తీసుకునేది వీళ్లే.చంద్రబాబుకు ఏది మంచి జరిగితే అదే చేస్తానంటాడు దత్తపుత్రుడు. ఏ పార్టీని కలవాలో దత్తపుత్రుడికి చంద్రాబాబే చెప్తాడు. బాబు చెప్తే దత్తపుత్రుడు బీజేపీ పక్కన చేరతాడు. చంద్రబాబు బీజేపీకి విడాకులు ఇవ్వమంటే ఇచ్చేస్తాడు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 గజదొంగల ముఠా సభ్యులు. చంద్రబాబు,



దత్తపుత్రుడు చక్రం తిప్పుతున్నారని రాస్తుంటారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే చంద్రబాబు గెలుపని పండగ చేసుకుంటారు. కర్ణాటకలో ఓడిన బీజేపీని తమతో కలిసి రావాలని వీళ్లే కోరతారు. వీరు చేస్తుంది జగన్‌తో కాదు జనంతో యుద్ధం. వీరు చేస్తుంది రాజకీయ పోరాటం కాదు.. అధికారం కోసం ఆరాటం. పేదలకు మంచి చేయాలన్న తపన, తాపత్రయం వారికి లేదు.:ప్రతి సామాజిక వర్గంలో కూడా ప్రతి పేదవారిని నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అని చెప్పి.. మీ బిడ్డ వారికోసం అనేక చర్యలు తీసుకుంటున్నాడు. అందుకే మన ప్రభుత్వాన్ని చూసి గత పాలకులు తట్టుకోలేకపోతున్నారు. పేదవాడికి మంచి జరుగుతుంటే జీర్ణించుకోలేకపోతున్నారు. నేను మంచిని నమ్ముకున్నా.. ప్రజలను నమ్ముకున్నా. ప్రతి అడుగులోనూ మంచి చేస్తున్నాం. దత్తపుత్రుడు షూటింగ్‌లకు విరామ సమయంలో బయటకు వస్తాడు.

## తెలుగు రాష్ట్రాల్లో మండుటెండలు

**గరిష్టంగా 45 డిగ్రీల వరకు నమోదు**
**ఎండల భయంతో జనం ఇళ్లకే పరిమితం**
**మరో మూడు రోజులు ఇదే పరిస్థితి అన్న వాతావరణ శాఖ**



హైదరాబాద్,మే16 ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండుతున్నాయి. మరో మూడునాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉండేలా ఉంది. రాగల మూడు రోజులు రాష్ట్రంలో వాతావరం పొడిగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.దిగువ స్థాయిలోని గాలులు వాయవ్య దిశ నుంచి రాష్ట్రం వైపు వీస్తున్నాయని అధికారులు వివరించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం హడలిపోతున్నారు. ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. మూగజీవాలు ఎండవేడిని తట్టుకోలేక అల్లాడుతున్నాయి. మధ్యాహ్నా వేళలో జనం ఇండ్లకే పరిమితం అవుతుండటంతో రోజువారీ వ్యాపారాలు కుదేలవుతున్నాయి. రాష్ట్రంలో మరో మూడు రోజులు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. హైదరాబాద్ దాని చుట్టపక్కల జిల్లాలలో పగటి ఉష్ణోగ్రతలు 38 నుంచి 41 డిగ్రీలు వరకు నమోదయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. వాయవ్య దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్న గాలుల ప్రభావంతో ..పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మంచిర్యాల, నిజామాబాద్, కుమ్రంభీం, ఆసిఫాబాద్, నల్లగొండ జిల్లాల్లో 45 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం మంచిర్యాల జిల్లాలోని కొండాపూర్‌లో 45.8, జన్నారంలో 45.8, బెల్లంపల్లిలో 45.4, నీల్వాయిలో 45.5, కొమ్మెర 44, జగిత్యాల జిల్లాలోని జైనాలో 45.5, కుమ్రంభీం జిల్లా కెరమెరిలో 45.4, నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో 45.1, నల్లగొండ జిల్లా పజ్జూరులో 45 డిగ్రీల సెంటీగ్రేడ్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఎండ తీవ్రతకు శరీరంలో నీరు త్వరగా ఆవిరైపోతుంది కాబట్టి నీటిని అధికంగా తీసుకోవాలి.

## జూన్ 4న కేరళకు రుతుపవనాలు: ఐఎండి

కొచ్చి: నైరుతి రుతుపవనాలు దాని సాధారణ షెడ్యూల్ కన్నా మూడు రోజులు ఆలస్యం కానున్నాయి. జూన్ 4న కేరళకు చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండి) మంగళవారం తన ఫోర్‌కాస్ట్‌లో తెలిపింది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య ఉండే వర్షాకాలం శరదృతువు పంటకు,



ఆహారపదార్థాల ధరల ద్రవ్యోల్బణాన్ని అదుపుచేయడానికి చాలా ముఖ్యమైనది.దేశ వ్యవసాయ ప్రాంతంలో 51 శాతం. అందులో 40 శాతం ఉత్పత్తి వర్షాధారం కావడంతో రుతుపవనాలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం. ఈ ఏడాది ఆర్థిక సర్వే ప్రకారం దేశ జనాభాలో 47 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రుతుపవనాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉంటాయి.2023లో భారతదేశంలో సాధారణం కంటే తక్కువ రుతుపవన వర్షాలు కురుస్తాయని ప్రైవేట్ వాతావరణ అంచనా ఏజెన్సీ స్కైమెట్ తెలిపింది. ఎల్ నినో సంభావ్యత పెరుగుతుంది, కనుక ఇది సాధారణంగా ఆసియాకు పొడి వాతావరణాన్ని తెస్తుంది అని తెలిపింది.మే 10 తర్వాత వరుసగా రెండు రోజుల పాటు లక్షద్వీప్, కేరళ తీరప్రాంతాలలోని 14 వాతావరణ కేంద్రాలలో కనీసం 60 శాతం 2.5 మిమీ. లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని ఐఎండి నైరుతి రుతుపవనాల ఆగమనాన్ని ప్రకటించింది. భారత ప్రధాన భూభాగంపై నైరుతి రుతుపవనాల పురోగతి కేరళలో దాని ప్రారంభంతో గుర్తించబడింది. ఇది వేడి, పొడి వర్షాకాలం వరకు పరివర్తనను వివరించే ముఖ్యమైన సూచిక.రుతుపవనాలు ఉత్తర దిశగా పురోగమిస్తాయి, వేసవి ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం కలిగిస్తాయి. నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ 1న సుమారు ఏడు రోజుల ప్రామాణిక విచలనంతో కేరళలో ప్రారంభమవుతాయి.

## ఉద్యోగాల నియామకాల్లో సమూల మార్పులు



**అంతా ఆన్‌లైన్ విధానంలో అమలు**
**అవినీతి,బంధుప్రీతిని దూరం చేశాం**
**రోగజ్‌గార్ మేళాలో ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,మే16 : ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చా మని, దీనివల్ల అవినీతి, బంధుప్రీతి అంతమయ్యాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రభుత్వో ద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం దగ్గర నుంచి ఫలితాల ప్రకటన వరకు యావత్తు పక్రియను ఆన్‌లైన్ చేశామని చెప్పారు. రోజ్‌గార్ మేళా సందర్భంగా ఆయన మంగళవారం ఉద్యోగార్హత పొందిన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. రోజ్‌గార్ మేళా సందర్భంగా వర్చువల్ విధానంలో మోదీ దేశవ్యాప్తంగా సుమారు 71 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తన ప్రభుత్వం నియామకాల విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చిందని చెప్పారు. ప్రభుత్వోద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం దగ్గర నుంచి ఫలితాల ప్రకటన వరకు యావత్తు పక్రియను ఆన్‌లైన్ చేశామని చెప్పారు. దీనివల్ల అవినీతి, బంధుప్రీతి అంతమయ్యాయని తెలిపారు. తన ప్రభుత్వం గడచిన తొమ్మిదేళ్ళలో సృష్టించిన ఉపాధి అవకాశాల గురించి వివరించారు. దేశంలో జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధిని కూడా వివరించారు. వాల్మార్ట్, యాపిల్, ఫాక్స్‌కాన్, సిస్కో వంటి ప్రధాన గ్లోబల్ కంపెనీల సీఈఓలతో తాను ఇటీవల సమావేశమయ్యానని, మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికరంగం మునుపెన్నడూ లేనంత సకారాత్మక ధోరణిని ప్రదర్శిస్తోందని చెప్పారు. ఫార్మల్ ఎంఎ÷-లాయ్‌మెంట్ వృద్ధి చెందుతోందని, 2018-19 నుంచి దేశంలో 4.5 కోట్ల మంది ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఈపీఎఫ్ఓ (ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ) వెల్లడించిన గణాంకాలను ప్రస్తావించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, రికార్డు స్థాయి ఎగుమతులు దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ నూతన ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నాయన్నారు. నూతన రంగాలకు తన ప్రభుత్వం మద్దతిస్తుండటం వల్ల ఉద్యోగాల స్వభావం మారుతోందని చెప్పారు. స్టార్టప్ సెక్టర్లో మన దేశం విప్లవాన్ని సృష్టించిందన్నారు. 2014 కన్నా ముందు కేవలం కొన్ని వందల సంఖ్యలో స్టార్టప్ కంపెనీలు ఉండేవని, ఇప్పుడు వీటి సంఖ్య దాదాపు 1,00,000కు చేరిందని చెప్పారు. వీటి వల్ల కనీసం 10 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే.

## మోడీ నిర్ణయాలతో ఆర్థికశక్తిగా భారత్: బిజెపి

విశాఖపట్టణం,మే16: భారతదేశాన్ని అభివృద్ధి చెందుతున్న ఆర్థికశక్తిగా ప్రపంచదేశాలు గుర్తిస్తున్నాయని బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని ఆకర్శిస్తున్నాయని అన్నారు. అవినీతిని అంతమొందించడం, నల్లధనం రూపుమాపాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పెద్దనోట్ల రద్దు,జిఎస్టీవంటి నిర్ణయాన్ని తీసుకున్నారని అన్నారు. ఇటీవలి నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు మోడీ నిర్ణయాలకు దక్కిన అతిపెద్ద మద్దతు అని అన్నారు. దేశప్రయో జనాలకోసం ప్రధాని మోడీ అనేక కార్యక్ర మాలు చేస్తున్నారని తెలిపారు. జిఎస్టీపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తూ ఒకరకమైన అభద్రతా వాతావరణాన్ని కల్పిస్తున్నాయని, అయినా ప్రజలు ఎటువంటి ఆందోళనలకు గురికాకుండా ప్రధానిపై నమ్మకాన్ని ఉంచారని తెలిపారు. టెర్రరిజం అణచివేతకు కూడా ప్రధాని పిలుపు ఇప్పుడు ప్రపంచ దేశాలకు అవగతం అవుతో ందన్నారు. ప్రజలు ఇప్పుడిప్పుడేఅవగాహన పెంచుకుంటున్నారని అన్నారు. అవినీతి రహితమైన దేశంకోసమే నరేంద్రమోదీ ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. నిరుపేదల ఉన్నతికి ముద్ర యోజన, జన్‌ధన్, సుకన్య సమృద్ధి, భేటీ బచావో...బేటీ పడావో తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పెద్దనోట్ల రద్దుతో ఉగ్రవాదం నిర్మూలన, మాఫీయాకు అడ్డుకట్ట పడిందన్నారు.

## ఈ-గరుడ ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం.. హైదరాబాద్ టు విజయవాడకు 20 నిమిషాలకో బస్సు

హైదరాబాద్ : పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు 'ఈ- గరుడ' పేరుతో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. 10 ఈ ? గరుడ బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్ జెండా ఊపి ప్రారంభించారు.హైదరాబాద్- విజయవాడ మార్గంలో 50 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను నడపాలని నిర్ణయించిన టీఎస్‌ఆర్టీసీ.. వీటిలో 10 బస్సులను మియాపూర్‌లో ప్రారంభించారు. మిగతా బస్సులు ఈ ఏడాది చివరినాటికి విడతలవారీగా అందుబాటులోకి రానున్నాయి. హైటెక్ హంగులతో హైదరాబాద్- విజయవాడ మార్గంలో 20 నిమిషాలకో ఈ- గరుడ బస్సు నడిపేలా ప్రణాళిక రూపొందించామని సంస్థ ప్రకటించింది. రెండేండ్లలో కొత్తగా 1,860 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని తెలిపింది.ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ? విజయవాడ మధ్య ఇంటర్ సిటీ బస్సులు ప్రారంభించామని తెలిపారు. ఈ-గరుడ బస్సులో అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. హైదరాబాద్ నగరంలో త్వరలో ఎలక్ట్రిక్, డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. త్వరలో 10 డబుల్ డెక్కర్, 550 ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభిస్తామని చెప్పారు.

## అమరావతి పరిధిలోని రైతులకు శుభవార్త.. చకచకా ఏర్పాట్లు!

విజయవాడ ,రాజధాని అమరావతి ప్రాంత పరిధిలోని రైతులకు జగన్ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు భూ పంపిణీకి సంబంధించి ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది.గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఆర్-5 జోన్‌లో భూముల పంపకానికి సంబంధించి అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలలోని పేద ప్రజలకు 1,402.58 ఎకరాల్లో భూ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. నిడమర్రు, కృష్ణాయపాలెం, నవులూరు, ఐనవోలు, మందడం, కురగల్లు, యర్రబాలెం, పిచ్చుకలపాలెం, బోరుపాలెం, నెక్కల్లు, అనంతవరం ప్రాంతాల్లో లే ఔట్లలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. 25 లే ఔట్లలో అభివృద్ధి పనులు చేపట్టారు. దీని ద్వారా 50,004 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది.మరోవైపు, హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని సుప్రీం కోర్టును అమరావతి ప్రాంత రైతులు ఆశ్రయించారు. కానీ, స్టే ఇవ్వడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ పిటిషన్‌ను కూడా రాజధాని అమరావతికి సంబంధించి విచారణ చేస్తున్న ధర్మాసనానికి బదిలీ చేసింది. పలు లే ఔట్లలో జంగిల్ క్లియరెన్స్, సరిహద్దు రాళ్ల ప్లాంటేషన్ పూర్తయ్యాయి. లే ఔట్ లోపల రోడ్లు వేసే ప్రక్రియ కూడా చకచకా సాగుతోంది. 180 కిలో మీటర్ల మేర గ్రావెల్‌తో రహదార్ల అభివృద్ధి జరుగుతోంది.



అదనంగా కేటాయించిన 268 ఎకరాల్లోనూ జోరుగా లే ఔట్ పనులు జరుగుతున్నాయి.క, ఎస్ 3 జోన్ పరిధిలోని బోరుపాలెం, నెక్కల్లు, అనంతవరం, పిచ్చుకల పాలెంలో అదనంగా భూ కేటాయింపులు చేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అదనపు లే ఔట్ల వద్ద భారీగా పోలీసులు మోహరించారు. అమరావతి రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుటుంది.కాగా, రాజధాని అమరావతి ఆర్-5 జోన్‌లో ఇతర ప్రాంతాల పేద ప్రజలకు ఇళ్ల స్థలాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా పనులను పూర్తి చేస్తోంది. ఆర్- 5 జోన్‌లో లే ఔట్లు వేయడం, ప్లాటింగ్ చేసే పనులు జరుగుతున్నాయి. తాజాగా, ఆ ప్రాంతంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 18వ తేదీన ఆర్-5 జోన్‌లో పేదలకు భూములు పంపిణీ చేయనున్నారు. సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించనున్న విషయం తెలిసిందే.

# సంపాదకీయం

బుధవారం 17-05-2023

## యువతను ఆకట్టుకుంటే గెలిచినట్టే

ఏ ప్రజాస్వామ్య దేశానికైనా ఎన్నికలే కీలకం. ఓటర్ల తీర్పు ఆధారంగానే ప్రభుత్వాలు కొలువు తీరి, అధికారాన్ని చెలాయిస్తాయి అని జగమెరిగిన సత్యం. ఇక రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికలు చాలా కీలకమైనవి. భారత్ భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఉన్న భారత్, అత్యధిక యువ జనాభా కలిగిన దేశం కూడా. 2024 ఎన్నికల్లో అదనంగా 5% శాతం అనగా నాలుగు కోట్ల 10 లక్షలమంది, కొత్తగా 18-25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు నూతన ఓటర్లుగా రాబోతున్నారు. ఈ యువ ఓటర్లే కీలకం అని, అన్ని రాజకీయ పార్టీలు గ్రహించాలి. వీరు విద్యావంతులు, ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వారు. వీరిలో నూటికి తొంభై శాతం మంది సామాజిక మాధ్యమాల్లో విహరించే వారే. కావున వీరి ఆకాంక్షలు దృష్టిలో ఉంచుకుని, అన్ని రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోను సిద్ధం చేసుకోవాలిమనలాంటి ప్రజాస్వామ్య దేశం కూడా దీనికి అతీతమైనది కాదు. అయితే, మన దేశంలో ఇప్పటి వరకు జరిగిన అన్ని సార్వత్రిక ఎన్నికలు కుల మత వర్గ ప్రాంతీయ భాషా వంటి ప్రభావంతో జరుగుతున్నవి. భవిష్యత్తులోనూ వీటి ప్రభావం ఉంటుంది. గత 2014 నుంచి పై అంశాలతో పాటు దేశభక్తి, మతం పేరుతో ఓట్లు దండుకునే కార్యక్రమం ఎక్కువైంది. పైగా ఎక్కువ మంది నిరక్షరాస్యత, పేదరికం వలన ఆయా అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ, ఆ ప్రభావానికి లోనై ఆయా పార్టీలకు ఓట్లు ఇస్తూ, గద్దె నెక్కడానికే సహాయపడుతున్నారు. అదే సమయంలో మేధావులు, చదువుకున్న వారు, నగర, పట్టణ వాసులు ఎన్నికల్లో వారి వారి ఓట్లు సద్వినియోగం చేసుకోలేకపోవడం (ఓటు వేయకుండా దూరంగా ఉంటున్నారు) పరిపాటి అయిపోయింది. ఇకనైనా అందరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాలి. వివిధ పార్టీలు ఇచ్చే బహుమానాలకు , ప్రలోభాలకు లొంగరాదు. నీతిగా నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవడం సమంజసం. తమకు, భవిష్యత్తు తరాల అభివృద్ధి కొరకు చిత్తశుద్ధితో పని చేసే పార్టీలకు అండగా నిలవాలి. రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా పని చేసే పార్టీలకు అండదండగా నిలవాలి.. ఇప్పటికే దేశంలో నిరుద్యోగం ఆకాశం ఎత్తు పెరుగుతుంది. ధరలు మండిపోతున్నాయి. ప్రైవేటీకరణ, ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం, లే అవుట్లు దేశం అంతా విస్తరించి ఉన్న ప్రస్తుత తరుణంలో, రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోను యువతకు విద్యా, నైపుణ్యాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఉండాలి.నూతన పెన్షన్ విధానం రద్దు చేసే విధంగా ప్రణాళికలు ప్రకటించాలి. రైతులకు, వ్యవసాయానికి భరోసా కల్పించాలి. పారిశ్రామిక రంగాలు అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలి. ప్రజల మధ్య చిచ్చు పెట్టే కుల మత ప్రాంతీయ భాషా లింగ ఆధారంగా ఓట్లు దండుకునే పథకాలకు స్వస్తి పలకాలి. ఇప్పుడే కర్ణాటక ఎన్నికల క్యాంపెయిన్‌లో ప్రధాన జాతీయ పార్టీలైన వారు ముఖ్యంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న పాలకులు ఎంత దిగజారి మత పరమైన అంశాలను తలకెత్తుకుని ప్రచారం చేసారో మనం అందరం చూసాం. ఒకపక్క మణిపూర్‌లో అంతర్గత హింసలో సుమారు 54 మందికి పైగా ప్రజలు మరణించినా, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం అయినా, సుమారు 1300 మంది నిరాశ్రయులయినా, ఏమీ పట్టనట్టు కేంద్ర ప్రధాన పాలకులు అంతా ఒక రాష్ట్రం (కర్ణాటక)లో ఓట్లు దండుకునే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.మనదేశం లౌకిక రాజ్యం అని, భిన్నత్వంలో ఏకత్వం అనే విషయాన్ని మరిచిపోయారు. పౌర సమాజం ఇక్కడే, ఇటువంటి సందర్భంలో అప్రమత్తంగా ఉండాలి. వాస్తవాలను విశ్లేషణ చేయాలి. మంచి వివేకంతో భవిష్యత్తు భారత్ నిర్మించాలి. ఈ ప్రక్రియలో చదువుకున్న యువత కీలక పాత్ర పోషించాలి. నూతన యువ ఓటర్లే భవ్య భారతికి దిశానిర్దేశం చేయాలి. పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవాలి అన్నా, భారత్ రాజ్యాంగ ఆశయాలు సాధించాలన్నా, ప్రజాస్వామ్య లౌకిక సామ్యవాద సమాఖ్య వ్యవస్థ భారత్‌లో మరింతగా ప్రాధాన్యత సంతరించుకోవాలి అంటే అందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి. ప్రలోభాలకు లొంగకుండా, నీతిగా నిజాయితీగా ఓటు వేసి, భవిష్యత్తు భారత్ నిర్మించే వారికి అండదండలు అందించాలి. యువ ఓటర్లే కీలక పాత్ర పోషించాలి.

# టార్గెట్ లింగమనేని...

విజయవాడ, మే 16, (న్యూస్ పల్స్)లింగమనేని రమేష్.. ప్రముఖ వ్యాపారవేత్త. ఎయిర్ కోస్టాకు ఆయన ఛైర్మన్. రియల్ ఎస్టేట్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. అంత వరకూ ఓకే. అయితే ఆయన ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లింగమనేని రమేష్ ఎందుకు టార్గెట్ అయ్యారు? ఉండవల్లి కరకట్ట మీద ఉన్న అతిథి గృహాన్ని ఎందుకు ఏపీ సీఐడీ సీజ్ చేసింది. చంద్రబాబు అందులో ఉంటున్నందుకా? లేక లింగమనేని రమేష్ తో వైసీపీకి ప్రత్యేక మైన శత్రుత్వం ఉందా? అన్న ప్రశ్నలు అనేక మంది మదిలో ఉన్నాయి. లింగమనేని రమేష్ వ్యాపారవేత్త మాత్రమే కాదు రాజకీయ నేతలకు అత్యంత సన్నిహితుడు. ప్రధానంగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు మాత్రమే కాదు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు కూడా ఆప్తమిత్రుడుగా ఉన్నారు. జనసేన పార్టీ కార్యాలయం నిర్మాణానికి లింగమనేని సహకారం కూడా ఉందంటారు. అసలు రెండు పార్టీల మధ్య పొత్తు కుదరడానికి ప్రధాన కారణం లింగమనేని రమేష్ అన్నది కూడా రాజకీయ వర్గాల్లో బలమైన టాక్ వినిపిస్తుంది. అందుకే వైసీపీ ప్రభుత్వం లింగమనేని రమేష్ ను టార్గెట్ చేసింది. ఆయన గెస్ట్ హౌస్ ను సీజ్ చేసిందని చెబుతున్నారు. గతంలోనూ ఒకసారి లింగమనేని గెస్ట్ హౌస్ పై కేసులు నమోదు చేసినా ఆయన న్యాయస్థానాలను ఆశ్రయించి స్టేలు తెచ్చుకున్నారు.ఇక అమరావతి రాజధాని నిర్ణయం వెనక కూడా లింగమనేని రమేష్ ఐడియా ఉందనే వారు కూడా లేకపోలేదు. ఆయన చెప్పిన మీదటే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని రాజధానిగా నిర్ణయించారన్న వాదన కూడా లేకపోలేదు. అక్కడ వేలాది ఎకరాలను ముందుగానే కొనుగోలు చేసిన లింగమనేని ఎస్టేట్ ఆ తర్వాత అక్కడ రాజధాని ప్రకటన వచ్చేలా చేశారంటారు. ఆయన కు అనుకూలంగా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్ లో మార్పులు చేర్పులు జరిగాయని, ఇందులో క్విడ్ ప్రోకో జరిగిందని ఏపీ సీఐడీ ఆరోపిస్తుంది. అప్పటి సీఆర్డీఏ అధికారులను విచారించినప్పుడు అలైన్ మెంట్ ను ?ర్చాలని చెప్పింది మంత్రి నారాయణ

అని, లింగమనేని రమేష్ భూములు, గెస్ట్ హౌస్ కు ఇబ్బంది కలగకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించారని వారు చెప్పడంతో కేసు నమోదు చేశారు.అయితే నిన్న మొన్నటి వరకూ హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకోవడంతో దీనిపై ఏపీ సీఐడీ ఎలాంటి కేసులు నమోదు చేయలేకపోయింది. చర్యలు తీసుకోలేకపోయింది. కానీ ఇటీవల సుప్రీంకోర్టులో హైకోర్టు స్టే ఎత్తి వేయడంతో ఏపీ సీఐడీ మరోసారి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్ మార్పులపై చర్యలకు దిగింది. నాలుగేళ్లు స్టేలపై నెట్టుకువచ్చినా, ఇప్పుడు సుప్రీంకోర్టు స్టే ఎత్తివేయడంతోనే తాము చర్యలకు దిగామని ప్రభుత్వం వాదిస్తుంది. అందునా చంద్రబాబు, పవన్ ల మధ్య పొత్తు కుదరడానికి ప్రధాన కారకుడైన లింగమనేని రమేష్ ను ఆర్థికంగా నష్టపర్చాలన్న ఆలోచనే ఇప్పుడు కరకట్టపై ఉన్న గెస్ట్ హౌస్ ను అటాచ్ చేయడంతో పాటు అనేక బ్యాంక్ ఖాతాలను ఏపీ సీఐడీ సీజ్ చేసిందనే వారు కూడా లేకపోలేదు. మొత్తం ఏపీ పాలిటిక్స్ లోకి మరొకసారి లింగమనేని రమేష్ వచ్చారనే అనుకోవాలి.

## విజయసాయిరెడ్డి వర్సెస్ సుబ్బారెడ్డి



విశాఖపట్టణం, మే 16, వైఎస్ఆర్‌సీపీలో నేతల మధ్య రాజకీయ పోరాటం హద్దులు దాటుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ ఆధిపత్య పోరాటం కారణంగా సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ బాధ్యతలు వదులుకున్నారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి మధ్య ఇలాంటి పరిస్థితులే ఏర్పడుతున్నాయని వైజాగ్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న పరిమామాలు వెల్లడిస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. విశాఖలో పీవీ సురేష్ అనే కార్పొరేటర్ ను వైఎస్ఆర్‌సీపీ కార్పొరేటర్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. అలాగే దొడ్డి మురళి అనే మరో డివిజన్ అధ్యక్షుడికీ గుడ్ బై చెప్పింది. దీంతో విశాఖ వైసీపీలో కలకలం ప్రారంభమయింది. ఎందకంటే విర్దదరూ విజయసాయిరెడ్డికి అనుచరులు. గతంలో విజయసాయిరెడ్డికి విగ్రహం పెట్టి మరీ పాలాభిషేకం చేశారు దొడ్డి మురళి. వీరిద్దరూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పార్టీ నుంచి బహిష్కరించారు. మూడు రోజుల కిందట విజయసాయిరెడ్డి అనుచరుల్ని పార్టీ పదవుల నుంచి తొలగించారు సుబ్బారెడ్డి. వెంటనే విజయసాయిరెవడ్డి పార్టీ అనుబంధ సంఘాల ఇంచార్జ్ హోదాలో మళ్లీ వారిని పార్టీ పదవుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది కూడా వివాదాస్పదమవుతోంది. విశాఖకు విజయసాయిరెడ్డి చాలా కాలం ఇంచార్జ్ గా ఉన్నారు. విజయసాయిరెడ్డికి సీఎం జగన్ ప్రాధాన్యం తగ్గించారు. ప్రస్తుతం విశాఖ వైసీపీ ఇంచార్జ్ గా వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు. విజయసాయిరెడ్డి నియమించిన వారిని పార్టీ పదవుల నుంచి తొలగించారు. తాను నియమించారు. విశాఖపై పట్టు కోల్పోకూడదనుకుంటున్న విజయసాయిరెడ్డి వెంటనే పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుని హోదాలో.. మళ్లీ విశాఖలో తన అనుచరుల్ని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చేశారు. దీంతో వైవీ సుబ్బారెడ్డి కారాలు మిరియాలు నూరుతున్నారు. ఇద్దరూ పోటాపోటీగా చర్యలు తీసుకుంటూడటంతో వివాదం ముదిరిపోతోందని వైసీపీ నేతలు కంగారు పడుతున్నారు. విజయసాయిరెడ్డి ఇటీవల సైలెంట్ గా ఉంటున్నారు. ఢిల్లీలోనే ఎక్కువ ఉంటుంది. ఇటీవల బాలినేని రాజీనామా చేసిన మూడు జిల్లాల కోఆర్డినేటర్ పదవిని విజయసాయికి ఇచ్చారన్న ప్రచారంఉంది. కానీ ఈ అంశంపై అధికారికంగా ప్రకటన లేదు. ఇలా బాధ్యతలిచ్చారని విజయసాయిరెడ్డి కూడా ప్రకటించలేదు. ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య జరిగిన పోరాటం కాస్తా అంతర్గత వివాదాలకు కారమం అయింది. ఇప్పుడు విశాఖ ఇష్యూ వైసీపీలో మరింత గందరగోళానికి కారణం అవుతోంది. హైకమాండ్ జోక్యం చేసుకుని ఇలాంటి వాటిని పరిష్కరించాలని వైసీపీ నేతలంటున్నారు.

# మళ్లీ మూడు పార్టీల ముచ్చట

విజయవాడ, మే 16, పవన్ కల్యాణ్ స్పీచ్‌లో ఆంధ్రప్రదేశ్ రాజకీయం మరో టర్న్ తీసుకుంది. బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య పొత్తు ఉంటుందని ఆయన చెప్పడం సంచలనంగా మారింది. రాష్ట్రంలో మరింత బలపడాలని బీజేపీ, జనసేన వ్యూహాలు రచిస్తున్న టైంలో కాంబినేషన్ ఎలా సెట్ అవుతుందనే చర్చ ఇప్పుడు మొదలైంది. దానికి టు ప్లస్ టు ప్లస్ వన్ ఫార్ములా తెరపైకి తీసుకొస్తున్నారు కొందరు విశ్లేషకులు. 2014లో ఈ కాంబినేషన్ పొలిటికల్ తెరపై కనిపించినా... అప్పటికి జనసేన పోటీ లేదు. బీజేపీ నామమాత్రంగా ఉండేది. అందుకే కలిసి పోటీ చేయడం చాలా ఈజీ అయ్యింది. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నం. కేంద్రంలో అధికారంలో ఉన్నందున ఆంధ్రప్రదేశ్‌లో కచ్చితంగా ఒంటరిగా ఎదగాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. తనకున్న ఫ్యాన్ బేస్, ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని బలమైన పార్టీగా నిలబడాలని శ్రమిస్తున్నారు పవన్ కల్యాణ్. అందుకే ఈసారి సీట్ల పంచాయితీ, పొత్తుల పితలాటకం మామూలుగా ఉండబోదనే విశ్లేషణలు బలంగానే వినిపిస్తున్నాయి. ఈ చిక్కు ముడిని మూడు పార్టీల అధినాయకత్వం ఎలా విప్పుతుందనే డిస్కషన్ పొలిటికల్ సర్కిల్‌లో జోరుగా సాగుతోంది. జనసేన అధినేత పవన్ మంగళగిరి పార్టీ కార్యాలయంలో మండల, కమిటి సమావేశాల్లో చేసిన ప్రసంగం ఈ చర్చకు దారి తీసింది. జనసేన, తెలుగు దేశం, భారతీయ జనతా పార్టీ వచ్చే ఎన్నికల్లో కూటమిగా పని చేస్తాయని స్పష్టం చేశారు. పొత్తు లెక్కలు పక్కాగా ఉంటాయని కూడా తేల్చేశారు. తెలుగు దేశం, భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ విషయాన్ని వారే స్పష్టంగా తమ పార్టీ తరపున చెప్పాల్సి ఉంటుందని అన్నారు. దీనిపై అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ భగ్గుమంది. పవన్ టార్గెట్‌గా ఎన్ని కామెంట్స్ చేయాలో అన్నీ చేస్తోంది. విమర్శల డోస్‌ను కూడా పెంచింది. కేవలం పవన్ మాత్రమే పొత్తుల కోసం వెంప్లర్లాడుతున్నారని సెటైర్లు వేస్తోంది. టీడీపీ పంచన చేరేందుకు పవన్ ఆత్రుతగా ఉన్నారంటూ ఆరోపణలు గుప్పిస్తోంది.పొత్తుల వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పవన్ చేసిన కామెంట్స్ కీలకంగా మారాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల హీట్ పెరిగిపోయింది. అటు అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ఇటు ప్రతిపక్షాలు ఎన్నికల కోసం సిద్ధమవుతున్నాయి. ప్రతిపక్షం అయితే ఒక అడుగు ముందుకు వేసి ముందస్తు ఎన్నికలు ఉంటాయని ప్రచారం చేస్తోంది. ఎన్నికల ఊపు రావటంతో ప్రతిపక్షాలు ఎవరి ఎత్తుల్లో వారు బిజీగా ఉన్నారు. జనసేన పార్టీకి మొత్తం 175 నియోజకవర్గాల్లో పోటీ చేసే పరిస్థితి కనిపించం లేదు. అందుకే తెలుగుదేశం బలాన్ని వాడుకోవాలని చూస్తోంది. తెలుగు దేశం పార్టీ సింగల్‌గా వెళితే పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. కేంద్రంలో అధికారంలో బీజేపిని కలుపుకోవటం ద్వారా లబ్ధి పొందాలని టీడీపీ ప్లాన్ చేస్తోంది. అందుకే మూడు పార్టీలు కలసి లెక్కను పక్కా చేసుకోవాలని చూస్తున్నాయి. మూడు పార్టీలు ఒక్కటైతే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై ముప్పేట దాడి చేసేందుకు ఉపయోగపడుతుందని పవన్ ఉద్దేశంగా చెబుతున్నారు. ఈ కలయికకు కేంద్ర బిందువైన సీఎం పదవిపై ఎన్నికల తర్వాత నిర్ణయించుకోవచ్చని పవన్ చెబుతున్నారని జనసేన వాదన. అన్ని అనుకున్నట్లుగా సీట్లు మెజార్టీ వస్తే మొదటి రెండు సంవత్సరాలు తెలుగు దేశం పార్టీ ముఖ్యమంత్రి సీట్ దక్కించుకుంటుంది.

ఆ తరువాత రెండేళ్లు జనసేన పార్టీ, చివరి ఏడాది భారతీయ జనతా పార్టీకి షేర్ చేసేందుకు ప్లాన్ ఉందని ప్రచారం జరుగుతోంది. దీనికి టీడీపీ ఒప్పుకుంటుందా అనేది అనుమానంగానే ఉంది. పొత్తుల వ్యవహారంలో పవన్ చేసిన కామెంట్స్‌పై అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దుమ్మెత్తిపోస్తోంది. జనసేన పార్టీకి చెందిన క్యాడర్‌కు క్లారిటి ఇచ్చే క్రమంలో పవన్ పొత్తుల విషయాలపై ముచ్చటించారు. పార్టీ శ్రేణులు అధికార పార్టీకి చెందిన నేతల మైండ్ గేమ్‌లో చిక్కుకోకుండా జాగ్రత్త పడేందుకు ఈ వ్యాఖ్యలు చేశారని పార్టీ వర్గాలు అంటున్నాయి. మచిలీపట్టణంలో జరిగిన పార్టీ పదో ఆవిర్భావ సభలో కూడా పవన్ ఇలాంటి కామెంట్‌లనే చేశారు. పార్టీకి చెందిన నాయకులు,కార్యకర్తలు ప్రతిపక్ష పార్టీ వేసే ట్రాప్‌లో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే పొత్తులపై చేసిన వ్యాఖ్యలు మాత్రం రాజకీయంగా దుమారాన్నే రాజేశాయి. సొంత పార్టీకి చెందిన నాయకులను టార్గెట్‌గా చేసుకొని, వారిని అప్రమత్తం చేయటంతోపాటుగా క్లారిటిగా సంకేతాలు పంపాలనుకున్న పవన్ కు వాస్తవానికి వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి పీఠం దక్కించుకోవటం తెలుగు దేశం పార్టీకి చాలా అవసరం. అలాంటిది చంద్రబాబుకు లేని తొందర జనసేనకు ఎందుకు, పొత్తులపైనే పవన్ ఎందుకు ఆరాటపడుతున్నారంటే, దాని వెనుక కూడా చంద్రబాబే ఉన్నారన్నది వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతల వాదన. సొ పవన్ ముఖ్యమంత్రి కావటాని కన్నా ముందు చంద్రబాబు సీఎం సీట్‌ను అధిరోహించాలనే కుతూహలం ఎక్కువ ఉందని విమర్శిస్తోంది

## తలనొప్పిగా కళ్యాణదుర్గం రాజకీయాలు

అనంతపురం, మే 16, అనంతపూరం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీలో గ్రూపు రాజకీయాలు పతాక స్థాయికి చేరాయి. యువగళం లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రోజున పాదయాత్ర చేపట్టాలని టీడీపీ అధిష్టానం ఆయా నియోజకవర్గాల ఇంచార్జిలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇందుకు పూర్తి విరుద్ధంగా కళ్యాణదుర్గం టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి పాదయాత్రలు చేపడుతున్నారు. దీంతో టీడీపీ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది. 2024 ఎన్నికలు సమీప ఇస్తున్న తరుణంలో కళ్యాణ దుర్గం టీడీపీ నేతలు గ్రూపు రాజకీయాలు చేయడం చంద్రబాబుకు తలనొప్పిగా మారుతుంది. కార్యకర్తలు కూడా ఎటువైపు వెళ్ళాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. కళ్యాణ దుర్గం నియోజకవర్గ ఇంచార్జ్ ఉమామహేశ్వర్ నాయుడు వర్గం సెట్టూరు మండలం యాటికల్లు నుంచి పాదయాత్ర చేపడుతుంటే మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గీయులు పాపంపల్లి నుంచి పాదయాత్ర చేపడుతున్నారు. దీంతో టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయి పాదయాత్ర చేపడుతుండడంతో సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి.మూడు సంవత్సరాల నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎవరికి వారే యమునా తీరే చందంగా గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీరియస్‌గా పట్టించుకోకపోవడంతో టీడీపీలో గ్రూపు రాజకీయాలు మితిమీరిపోతున్నాయని కార్యకర్తలు వాపోతున్నారు. ఈ సంఘీభావ పాదయాత్ర వల్ల టీడీపీ మైలేజ్ తగ్గే అవకాశం ఉందని పలువురు నాయకులు గుసగుసలాడుతున్నారు. నారా లోకేష్ అనంతపూర్ జిల్లాలో పాదయాత్ర చేపట్టిన సమయంలో కళ్యాణదుర్గం టీడీపీ గ్రూప్ రాజకీయాలు గురించి ఆయన దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. మరి ఈ పాదయాత్ర వల్ల టీడీపీ లాభమా నష్టమా అనేది చూడాల్సి ఉంది.

# చేతులు మాత్రమే కలుస్తున్నాయి...

నెల్లూరు, మే 16, నెల్లూరోళ్ల రాజకీయం మామూలుగా ఉండదు. పైకి సైలెంట్ గానే ఉన్నా.. లోలోపల ఎవరి రాజకీయాలు వారివి. నిన్న మొన్నటి వరకు భాయి భాయి అంటూ తిరిగినోళ్లు ఈరోజు ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. పైకి చేయి చేయి కలిపినా లోపల వారి ఎత్తులు, పైఎత్తులు అర్థం చేసుకోవడం కష్టం. తాజాగా నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్, ఆయన బాబాయ్ రూప్ కుమార్ యాదవ్ మధ్య రాజకీయం కూడా ఇలాగే మారింది. అనిల్ కుమార్ యాదవ్ రెండుసార్లు నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా గెలిచారు, జగన్ తొలి కేబినెట్ లో మంత్రిగానూ పనిచేశారు. ఆయన గెలుపుకి రూప్ కుమార్ సపోర్ట్ కూడా కీలకం. ఆ విషయం అనిల్ కి కూడా తెలుసు. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు రూప్ కుమార్ అందుబాటులో ఉంటారు. అనిల్ షాడోగా ఆయన చాలా వ్యవహారాలు చక్కబెట్టారు. కానీ ఎక్కడో వ్యవహారం తేడా కొట్టింది. అనిల్, రూప్ మధ్య గొడవ ముదిరింది. ఎంతగా అంటే.. రూప్ కొత్త ఆఫీస్ కూడా కట్టుకుంటున్నారు. రూప్ వర్గం అనిల్ దగ్గరకు వెళ్లడంలేదు. అప్పట్లో పార్టీలోనే ఉన్న కోటంరెడ్డితో కూడా రూప్ సన్నిహితంగా ఉన్నారు కానీ, అనిల్ తో మాత్రం కలవలేదు. ఆ తర్వాత రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి పార్టీనుంచి బయటకు రావడంతో రూప్, అనిల్ వ్యవహారంలో స్తబ్ధత నెలకొంది. కొన్నాళ్లు రూప్ కుమార్ సైలెంట్ గా ఉన్నారు. ఇటీవల సీఎం జగన్ కావలి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద అనిల్ కుమార్ యాదవ్, రూప్ కుమార్ యాదవ్ మధ్య సయోధ్య కుదర్చాలని చూశారు. ఇద్దరు చేతులు కలిపారు. అక్కడకు మీడియాకు అనుమతి లేకపోవడంతో ఆ ఫొటోలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఇంకేముంది ఇద్దరూ కలసిపోయారని అనుకున్నారంతా..?చేతులు కలిపాం కానీ, తమ మనసులు కలవలేదన్నట్టుగా అనిల్ స్టేట్ మెంట్లున్నాయి. జగన్ చెప్పారు కాబట్టి తాను చేతులు కలిపానని, కానీ ఆయనతో తాను కలిసే ప్రసక్తే లేదని అనిల్ అన్నట్టుగా ఆయన వర్గం చెబుతోంది. ఒకవేళ ఆ పరిస్థితే వస్తే రాజకీయాలు వదిలేస్తానని కూడా అని అన్నట్టు సమాచారం. ఈ ప్రచారం బయటకు వచ్చినా అనిల్ గ్రూప్ నుంచి ఎలాంటి స్పందన లేదు. అంటే కావాలనే అనిల్ వర్గం ఈ లీకుల్ని బయటకు పంపించినట్టు సమాచారం.ప్రస్తుతం నెల్లూరు టౌన్ లో అనిల్ వర్గం, రూప్ వర్గం రెండుగా విడిపోయాయి. నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ గా ఉన్న రూప్ కుమార్ యాదవ్ కొంతమంది కార్పొరేటర్లను తనవైపు తిప్పుకున్నారు. వారంతా అనిల్ వ్యతిరేక వర్గంగా ముద్రపడిపోయింది. వచ్చే దఫా అనిల్ కి సిటీలో టికెట్ ఇస్తే పార్టీ గెలుపు కష్టం అనే సంకేతాలు అదిష్టానానికి పంపేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు. అనిల్ కి టికెట్ రాకుండా అడ్డుకోడానికి పావులు కదుపుతున్నారు. మరోవైపు టీడీపీ నుంచి మాజీ మంత్రి నారాయణే నెల్లూరు సిటీలో పోటీకి దిగుతారని తెలుస్తోంది. ఈ దశలో గట్టి అభ్యర్థిని బరిలో నింపాలని వైసీపీ అధిష్టానం భావిస్తోంది. సొంత పార్టీలోనే అనిల్ కి కుంపటి ఎదురైతే..

అది కచ్చితంగా టికెట్ పై కూడా ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. అన్ని విషయాలు తెలిసినా కూడా అనిల్ మాత్రం రూప్ తో కలిసేందుకు ఇష్టపడటంలేదు. దగ్గరి బంధువులైనా కూడా వీరిద్దరూ ఎడమొహం పెడమొహంగా ఉండటం, సీఎం జగన్ చెప్పిన తర్వాత కూడా సఖ్యత కుదరకపోవడంతో.. నెల్లూరు సిటీలో వచ్చేదఫా వైసీపీ గెలుపుపై అనుమానాలు బలపడుతున్నాయి.

# గొర్రెల పెంపకం దారుల అవగాహన సదస్సు

రామడుగు రామడుగు మండలం రంగసాయి పల్లె గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం లబ్ధిదారులకు అవగాహన సదస్సు రంగసాయి పల్లె రైతు వేదిక ప్రాంగణంలో మంగళవారం నిర్వహించామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు తన వంతు వాటా 43,750 రూపాయలు చెల్లించి కావలసిన ధ్రువ పత్రాలు సంబంధిత పశువైద్యశాలలో అందించాలని డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారితో కూడిన టీం నియమించడం జరుగుతుందని పశు వైద్య అధికారులు ఎవరూ ఉండరని తెలిపారు. జిల్లా అధికారులతో కూడిన టీం లబ్ధిదారులను తమ వెంట తీసుకొని గొర్రెలు లభించు ప్రాంతాలకు తీసుకొని వెళ్లి లబ్ధిదారులకు నచ్చిన గొర్రెలు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. కరీంనగర్ జిల్లాకు గొర్రెలు కొనుటకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మహారాష్ట్ర లు కేటాయించడం జరిగిందని పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగసాయి పల్లె సర్పంచ్ సాదు పద్మ లింగారెడ్డి ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం రామడుగు అధ్యక్షులు మ్యాకల చిన్న బీరయ్య మాజీ సర్పంచ్ కురుమ సంఘం నాయకుడు కోరే గట్టయ్య రామడుగు పశువైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ గుండి లైవ్ స్టాక్ అధికారి నునువాల గిరిధర్ పశువైద్య సిబ్బంది కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి కడుతున్నపార్టీలు...చీలిక తెచ్చే పనిలో వైసీపీ

విజయవాడ, మే 16, : ముఖ్యమంత్రి పదవి వరించడం అంటే మామూలు విషయం కాదు. రాజకీయంగా ఒడిదుడుకులు, పోరాటాలు చేస్తేగానీ అది సాధ్యం కాదు. ఏ రాజకీయ పార్టీ అయినా అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాలన్నది ఆ పార్టీ నేతల లక్ష్యం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఒకవేళ పొత్తులతో గెలిస్తే ముఖ్యమంత్రి పీఠం ఎవరిని వరిస్తుందో అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. జాతీయ పార్టీల్లో అయితే ముఖ్యమంత్రి పదవిపై విపరీతమైన పోటీ ఉంటుంది. ఒక్కోసారి సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రులను ఎంపిక చేసిన సంగతి లేకపోలేదు. అంతటి ప్రతిష్టాత్మకమైన ముఖ్యమంత్రి పదవి ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చిచ్చు రేపుతోంది. ముఖ్యమంత్రి పదవిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అటు టీడీపీ, బీజేపీ, జనసేనల మధ్య రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు సబబే అయినప్పటికీ పొత్తులతో ఎన్నికలకు వెళ్లాల్సిన నేపథ్యంలో ముఖ్యమంత్రి పీఠం తమదంటే తమదేనంటూ రాజకీయ పార్టీలు వాగ్వాదానికి దిగుతున్నాయి. ఈ ముఖ్యమంత్రి పీఠం అధిరోహించే అంశంపై నెలకొన్న రాజకీయ పార్టీలలోని విభేదాలను తమవైపునకు తిప్పుకునేందుకు అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.ఆలులేదు సూలు లేదు అల్లుడు పేరు సోమలింగం అన్నట్లు ఏపీలోని రాజకీయాల పరిస్థితి నెలకొంది. ఇంకా పొత్తులు ఖారారు కాలేదు.. ఎలా ఎన్నికలకు వెళ్లాలి అనేదానిపై విపక్షాలు ఓ క్లారిటీకి రాలేదు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి పీఠంపై మాత్రం రగడ మొదలైంది. ఇందుకు కారణం కూడా జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో తుఫాన్ రేపుతున్నాయి. అటు బీజేపీ, టీడీపీలోనే కాదు జనసేనలోనూ గుబులు రేపుతున్నాయి. ముఖ్యమంత్రి పీఠం అనేది ఇప్పటికిప్పుడు వచ్చేది కాదని ఎన్నికల ఫలితాల అనంతరం ముఖ్యమంత్రి ఎవరనేదానిపై నిర్ణయం ఉంటుందని చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అంతేకాదు టీడీపీని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టేందుకు జనసేన సిద్ధంగా లేదని కూడా పవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి పీఠంపై జనసేనాని పవన్ కల్యాణ్ ఎప్పుడూ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి అవ్వాలనే రాజకీయాలతో రాలేదని ఒకసారి.....ఇప్పటికిప్పుడే ముఖ్యమంత్రి అయిపోవాలని తాను అనుకోవడం లేదని ఇలా అనేక వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారు.మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్న వేళ పవన్ కల్యాణ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో కనీసం 45 నుంచి 50 స్థానాలు గెలిచి వుంటే సీఎం పదవి



గురించి అడగటానికి వీలుండేదని తన మనసులో మాట బయటపెట్టారు. 2019లో జనసేన 134 స్థానాల్లో పోటీ చేసిందని.. కానీ మాయ చేసిన వాళ్లనే నమ్మారని పవన్ చెప్పుకొచ్చారు. ఈ సారి జనసేన ప్రభుత్వాన్ని స్థాపిస్తామని పవన్ ధీమా వ్యక్తం చేశారు. నమ్మకం అనేది ఒక్క రోజులో సంపాదించలేమని.. ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ స్థానంతో ఎంఐఎం దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతోందని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 2009లో పీఆర్పీకి వచ్చిన సీట్లు కూడా రాలేదని, ఎంఐఎంలా కాదు.. కనీసం విజయ్ కాంత్ పార్టీలా కూడా గౌరవించలేదే అని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. బలమున్న స్థానాల్లో ఎన్నికలకు వెళదామని.. మనకు వచ్చే స్థానాలను బట్టే సీఎం పదవి గురించి అడగటానికి వీలుంటుందన్నారు. పొత్తులు పెట్టుకోవడం వల్ల పార్టీ ఎదుగుతుందని పవన్ కల్యాణ్ తెలిపారు. చంద్రబాబు నాయుడు తనను మోసం చేస్తారని అంటున్నారని.. తానేమైనా చిన్నపిల్లాడినా మోసపోవడానికి అని పవన్ ప్రశ్నించారు. తనకు వయసు పెరిగిందని, గడ్డం నెరిసిందని .. ఏం తెలియకుండానే పార్టీలు పెట్టేసి, రాజకీయాల్లోకి వచ్చేస్తానా అంటూ పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమాలు చేసుకుంటే రోజుకు రెండు కోట్లు సంపాదిస్తానని కానీ అన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చానని పవన్ తెలిపారు.తెలుగుదేశం పార్టీ సైతం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపైనా స్పందిస్తోంది. పొత్తులో ఎన్నికలకు వెళ్లాలనుకోవడం మంచి నిర్ణయమని, అయితే ముఖ్యమంత్రి పీఠం మాత్రం టీడీపీకే ఉండాలని ఆ పార్టీలోని పలువురు సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ చంద్రబాబు, యువగళం పేరుతో లోకేశ్ పాదయాత్రలు చేస్తున్నారని.. టీడీపీకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు సైతం ఉందని టీడీపీ చెప్తోంది. అంతేకాదు ఇటీవల కాలంలో టీడీపీకి ఓట్ల ఫాలోయింగ్ కూడా విపరీతంగా పెరిగిందని.. ప్రజల్లో ఆదరణ సైతం పెరుగుతుందని టీడీపీ చెప్తోంది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో చంద్రబాబునే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.మరోవైపు ఈ ముఖ్యమంత్రి పీఠంపై బీజేపీ సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం జనసేనతో పొత్తులో ఉన్నామని బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు వెల్లడించారు. మరో పార్టీని(టీడీపీని) కలుపుకోవాలనే ప్రతిపాదనను పవన్ తీసుకొచ్చారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ వ్యతిరేకత ఓటు చీల్చకూడదనే అభిప్రాయాన్ని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఇదే విషయాన్ని బీజేపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పవన్ కల్యాణ్ కూడా బీజేపీ అధిష్టానంతో మాట్లాడుతున్నారని చెప్పారు. పొత్తులపై అంతిమ నిర్ణయం కేంద్ర నాయకత్వానిదేనని చెప్పారు. జనసేన, బీజేపీ ఎన్నికల్లో కలిసి వెళతామని మాత్రం తాము స్పష్టం చేయగలమని చెప్పుకొచ్చారు. మరోవైపు సీఎం పదవి అనేది ఎన్నికల ఫలితాల తర్వాతే నిర్ణయం ఉంటుందని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో కలిసి వెళ్లి వైసీపీని ఓడించడమే లక్ష్యమని ఆ తర్వాతే ముఖ్యమంత్రి పదవిపై ఎవరిని కూర్చోబెట్టాలి అనేది తేలుతుందని ఎంపీ జీవీఎల్ వెల్లడించారు.వచ్చే ఎన్నికల్లో సింగిల్‌గా సింహంలా పోటీ చేస్తామని వైసీపీ చెప్తోంది. ఇప్పటికే ప్రతిపక్షాలు బలంగా ఉంటున్న తరుణంలో చీలిక తీసుకువచ్చేందుకు వైసీపీ వ్యూహరచన చేస్తోంది. ఇదే తరుణంలో టీడీపీ, బీజేపీ, వైసీపీ కలిసి పోటీ చేస్తాయనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఈ పార్టీల మధ్య ముఖ్యమంత్రి పీఠంపై పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ఏదో ఒక అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి చీలిక తీసుకురావాలని వైసీపీ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియా వేదికగా వైసీపీ ట్రోల్ చేస్తోంది. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే దమ్ము పవన్ కల్యాణ్‌కు లేదని తేలిపోయిందని జనసైనికులు ఇక వైసీపీకి ఓటేయ్యండని కూడా పిలుపునిస్తున్నారు. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చునే బలం తమకు లేదని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టేలా ఉన్నాయని అర్థమవుతుందని వైసీపీ చెప్తోంది. ఇలా రెచ్చగొట్టి జనసైనికులను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తోంది.

# అంగన్వాడీలో బాలుడి మృతి..

## బంధువుల ఆందోళన


కాకినాడ కాకినాడ జిల్లా కాజులూరు మండల పరిధిలోని గొల్లపాలెం సాయిబాబా కాలనీ వద్ద మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో 9 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం ఇలా ఉంది.బరువు చూసుకునేందుకు బాలుడు ఉయ్యాల లాంటి తాడులో కూర్చొనగా ... అదికాస్తా మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక బాలుడు మృతి చెందినట్లు తెలిపారు.అయితే ఇంత జరిగినాఅంగన్వాడీ సిబ్బంది ఎక్కడా? గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.బాలుడు పేరు మనోజ్ ( 9) అంగన్వాడీ టీచర్ తలుపు దగ్గరగా వేసి, గర్భిణీలను పిలిచేందుకు వెళ్లే లోపు ఇద్దరు కుర్రాళ్ళు లోపలికి వెళ్ళి బరువు చూసుకుంటుండగా వేయింగ్ మిషన్ తాడు మెడకు చుట్టుకోవడంతో ఈ ప్రమాదం జరిగిందని గొల్లపాలెం ఎస్ ఐ తులసీరాం మీడియాకు తెలిపారు.ఈ ఘటన పోలీస్ స్టేషన్ కు కూత వేటు దూరంలో జరిగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు.మృత దేహాన్ని పోస్ట్ మార్టం కు తీసుకెళ్ళొద్దంటు బంధువులు అంగన్వాడీ కేంద్రం వద్ద బైఠాయించారు.

# రాజమండ్రిలో అత్యధికంగా 49 డిగ్రీలు

## విజయవాడ నుంచి ఉత్తరాంధ్ర వరకు ఎండలు

## అప్రమత్తంగా ఉండాలన్న వాతావరణ అధికారులు

రాజమండ్రి,మే16 : ఆంధ్రప్రదేశ్‌లో భానుడి భగభగలు సెగులు పుట్టిస్తున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరగుతుండటంతో పాటు ఉక్కపోతకు వేడిగాలి కూడా తోడవ్వడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.రాజమండ్రిలో 49 డిగ్రీలు నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. విజయవాడ నుంచి ఉత్తరాంధ్ర వరకు అత్యధికంగా 46డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండటంతో ప్రజలు బయటకు రావడానికి భయపడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. వృద్దులు, పిల్లలు బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే వడదెబ్బ తగిలి కొంతమంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోతతో ఇంట్లో ఉండలేక.. బయటకు రాలేక సతమతమవుతున్నారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సమాచారం ప్రకారం... 18 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 131 మండలాల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. అత్యధికంగా నెల్లూరు జిల్లా కొండాపురంలో 46.4, కృష్ణా జిల్లా కోదూరులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొన్నూరులో 45.9, ఆగిరిప్లలెలో 45.7, గోపాలపురంలో 45.4, గుంటూరులో



45.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనేకచోట్ల 40 నుంచి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, వడదెబ్బకు రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు మృతిచెందారు. కృష్ణా జిల్లాలో ఇద్దరు, అనంతపురం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున చనిపోయారు. విశాఖపట్నం జిల్లాలో కూడా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తకోటలో 40.23, నాతవరం 40.22, మునగపాక 40.17, కశింకోట 40.14, బలిఘట్టం 40.12, మాడుగుల 40.05, గంభీరం 40.01 డిగ్రీలు.. శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు 43, రాజాం 42, పాలకొండలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నెల్లూరు జిల్లాలో గరిష్టంగా 37.5 డిగ్రీలు, ప్రకాశంలో 36, తిరుపతిలో 41, చిత్తూరులో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మరో ఐదు రోజుల పాటు విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటు గుంటూరు, కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు కర్నూలు, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవ్వనుందని వాతావరణ శాఖ నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు రాయలసీమలోని చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో కూడా ఎండలు ఎక్కువగానే ఉంటాయని చెబుతున్నారు.

# నిర్మాణాత్మక ఎత్తుగడలకు దూరమేనా

ఏలూరు, మే 16,సినిమాల్లో పవర్ స్టార్ గా పేరు పొందిన పవన్ కళ్యాణ్ 'జనసేన పార్టీ పేరుతో సొంత పార్టీని స్థాపించి పదేళ్లు అయ్యింది. అయినా పవన్ కల్యాణ్ రాజకీయాల్లో సైడ్ క్యారెక్టర్ గానే ఉండిపోయారు. మూడు రోజుల క్రితం పవన్ కల్యాణ్.. పార్టీ నేతలో మాట్లాడుతూ.. సీఎం అయ్యే బలం ఇంకా రాలేదని ఒప్పుకున్నాడు. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడానికి, ఒంటరిగా ఎన్నికలలో పోరాడటానికి తన పార్టీకి పూర్తి స్థాయిలో తగినంత శక్తి లేదన్నారు. మరో మాటలో చెప్పాలంటే తనను, తన పార్టీని ఒక బలీయమైన శక్తిగా నిరూపించుకోవడానికి ఏపీ ఓటర్లు తనకు అవకాశం ఇవ్వలేదని నిందించారు.సినిమాల్లో అత్యున్నత స్థాయికి చేరుకున్నప్పటికీ, అభిమానుల హృదయాలలో హీరో స్థానాన్ని ఆస్వాదిస్తున్నప్పటికీ, 14 సంవత్సరాల రాజకీయ జీవితంలో పవన్ ఇప్పటికీ "సైడ్ యాక్టర్", "సపోర్టింగ్ క్యారెక్టర్"గా ఉండటానికి సిద్ధమయ్యారు. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఏర్పడుతున్న రాజకీయ సమీకరణాల్లో తన ఉనికిని చాటుకోవడానికి జనసేన నిర్మాణాత్మక ఎత్తుగడలు వేయలేకపోతుంది. ఇప్పటికీ పవన్ పూర్తిస్థాయిలో బలపడలేదనడానికి ఇటీవల చేసిన ప్రకటనే నిదర్శనం. వైసీపీని ఒంటరిగా ఎదుర్కొనే శక్తి జనసేనకు లేదని, టీడీపీతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందని పవన్ తాజాగా అంగీకరించినట్లు ఆ మాటలతో తెలుస్తోంది.వైఎస్ జగన్ నిరంకుశ పాలన నుంచి ఏపీని కాపాడడమే తన లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమిలో సహాయక పాత్ర పోషించేందుకు వెనుకాడబోనని పవన్ అంటున్నారు. మరో మాటలో చెప్పాలంటే దశాబ్దానికి పైగా రాజకీయాల్లో ఉన్న పవన్ జనసేనకు "జగన్ హఠావో- ఏపీ బచావో"అనే లక్ష్యం తప్ప, సమగ్ర ఎజెండా, విధానం లేదా విజన్ ఇంకా లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పవన్యయయ వైసీపీ "రాక్షస పాలన" బారి నుంచి ఏపీని విముక్తి చేయడానికి టీడీపీతో చేతులు కలపాలనే ఉద్దేశాన్ని వ్యక్తం చేస్తూనే తాను సీఎం పదవిని ఆశించలేనని స్పష్టం చేశారు.ప్రస్తుతం బీజేపీతో పొత్తులో ఉన్న పవన్ పార్టీ... వైఎస్ జగన్‌ను గద్దె దింపాలనే లక్ష్యంతో కాషాయ పార్టీని టీడీపీ కూటమిలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించేలా... టీడీపీని ఫినిష్ చేయాలనే ఇతర ఆలోచనలు ఉన్న బీజేపీ, టీడీపీతో చేతులు కలపడానికి విముఖంగా ఉంది. బీజేపీ పవన్ సూచనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఏది ఏమైనప్పటికీ, కర్ణాటకలో ఫలితాల్లో ఎదురుదెబ్బ, టీడీపీ జెఎస్పీ కూటమిలో చేరడంపై బీజేపీ రెండో ఆలోచన చేస్తుందని విశ్లేషణలు వస్తున్నాయి. ఎందుకంటే బీజేపీకి ఇప్పుడు దక్షిణాది నుంచి కొత్త పొత్తులు అవసరం. అదే సమయంలో ఏపీలో ఒక్క లోక్ సభ సీటు కూడా సొంతంగా గెలుపొందే పరిస్థితి బీజేపీ లేదు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ బీజేపీతో డైరెక్ట్ పొత్తు పెట్టుకునే ఛాన్స్ లేదు.

అనేక అంశాలలో కేంద్రంలోని బీజేపీ.. ఏపీ ప్రయోజనాల పట్ల ఉదాసీనత చూపుతున్నందుకు ఇప్పటికీ ఏపీ ఓటర్లు బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాబట్టి టీడీపీతో చేతులు కలపడానికి బీజేపీతో బంధాన్ని తెంచుకోవడానికి పవన్ కల్యాణ్ సిద్ధంగా ఉన్నారని సంకేతాలు ఇచ్చారు. దీంతో బీజేపీ జాతీయ నాయకత్వం డైలమాలో పడింది. అయితే వైసీపీ పవన్ టార్గెట్ చేసింది. టీడీపీ ప్రయోజనాలను నెరవేర్చేందుకే జనసేన రాజకీయాలు చేస్తుందని ఆరోపణలు చేస్తుంది. పవన్ రాజకీయాలు ..."జగన్‌ని తరిమికొట్టండి- చంద్రబాబును రక్షించండి" అనేలా ఉన్నాయన విశ్లేషకులు అంటున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన 10 సంవత్సరాల తర్వాత కూడా తనను తాను సపోర్టింగ్ క్యారెక్టర్ స్టేటస్‌కు తగ్గించుకోవడం ఇంకా పవన్ రాజకీయాల్లో ఓనమాల స్టేజ్ లోనే ఉన్నారంటున్నారు కొందు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందన్న భావన... పవన్ బలీయమైన శక్తిగా ఎదగడానికి ఛాన్స్ ఉన్నప్పటికీ ఆయన ఆ దిశగా ప్రయత్నాలు చేయడంలేదు. పవన్ మద్దతు కోసం టీడీపీ తహతహలాడుతుండడాన్ని కూడా పవన్ సరైన విధంగా వినియోగించుకోలేకపోతున్నారని విశ్లేషణలు వస్తున్నాయి. ఇంకా పవన్... చంద్రబాబు రాసిన స్క్రిప్ట్‌ను అనుసరిస్తూ... కన్ఫ్యూజన్ మోడ్‌లో ఉన్నారని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా పవన్ రాజకీయంగా ఎదగడానికి సొంత స్క్రిప్ట్ రాసుకోవాలంటున్నారు.

# మానవాళి శ్రేయస్సు కోసం సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం

## - భక్తుల నుండి టిటిడికి అభినందనలు

తిరుపతి, మే 16 తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో మంగళవారం ఉదయం 6 గంటలకు సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కెఎస్ఎస్ అవధాని మాట్లాడుతూ, సర్వ మానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ టిటిడి సంపూర్ణ అఖండ సుందరకాండ పారాయణాన్ని చేపట్టిందన్నారు. "హనుమంతుడు సీతాదేవిని కలుసుకుని తిరిగి మహేంద్రగిరికి రావడానికి 16 గంటల సమయం పట్టిందని చెప్పారు. కాబట్టి సుందరకాండలోని 2,872 శ్లోకాలను 16 గంటల్లో పఠించడం ద్వారా మనం అన్ని సమస్యల నుండి, పాపాల నుండి విముక్తి పొందుతాము" అని ఆయన పేర్కొన్నారు. రుత్వికులు పారాయణంతో పాటు ఏకకాలంలో యాగం కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య దాదాపు 16 గంటల పాటు నిర్విరామంగా అఖండ పారాయణ యజ్ఞం కొనసాగనుంది. నాలుగు బృందాల్లో వేద పండితులు ఈ శ్లోకాలను ఒక బృందం తరువాత మరొక బృందంగా పఠించనున్నారు. మొదట సంక్షిప్త రామాయణం నుండి 100 శ్లోకాలు తరువాత సుందరకాండలోని శ్లోకాలు పారాయణం చేస్తున్నారు. ఒకవైపు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు, మరో వైపు శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత రాముడు, మరో వైపు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులు ఉండగా ధర్మగిరిలోని ప్రార్థనా మందిరాన్ని వివిధ దేవతామూర్తులతో అలంకరించారు. వివిధ చోట్ల ఆంజనేయుడి దివ్యరూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశం నలుమూలలతోపాటు విదేశాల నుండి సైతం భక్తులు ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా శ్లోక పారాయణంలో పాల్గొన్నారు. ఈ పారాయణ కార్యక్రమాని నిర్వహిస్తున్న టీటీడీకి భక్తులు అభినందనలు తెలియజేశారు. వేదపండితులు, భక్తులు చేసిన అఖండ సుందరకాండ పారాయణంతో ధర్మగిరి ప్రాంగణం మారుమోగింది. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీ రఘునాథ్ బృందం శ్రీ హనుమాన్ జై హనుమాన్ భజనతో కార్యక్రమం ప్రారంభమైంది. ప్రముఖ పండితులు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ రాణిసదాశివమూర్తి, ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ విభీషణ శర్మ, ధర్మగిరి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఎస్వీ ఉన్నత వేద అధ్యయనాలు తదితర వేద పండితులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. సీఈవో ఎస్వీబీసీ షణ్ముఖ్ కుమార్, ఎస్ఈ 2 జగదీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, వీజీఓ బాలిరెడ్డి, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.ఆకాశగంగ, జాపాలిలో ఆకట్టుకున్న ధార్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహిస్తున్న ధార్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# నేడు ప్రపంచ టెలి కమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవం

ప్రపంచ టెలి కమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 17న నిర్వహించబడుతుంది. సాంకేతికత (టెక్నాలజీ) ద్వారా వచ్చే అవకాశాలపై అవగాహన పెంచడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు.టెలి కమ్యూనికేషన్ దినోత్సం: మొదటిసారిగా మే 17, 1968లో ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవం జరుపుకున్నారు. మే 17న అంతర్జాతీయ టెలిగ్రాఫ్ యూనియన్ స్థాపించారు. అలాగే మొదటి అంతర్జాతీయ టెలిగ్రాఫ్ కన్వెన్షన్ పై 1865 మే 17న పారిస్‌లో సంతకం చేశారు. అందువల్ల మే 17ను ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవంగా ప్రకటించారు.సమాచార సొసైటీ దినోత్సవం: 2005లో ట్యూనిస్‌లోని ఇన్ఫర్మేషన్ సొసైటీపై ప్రపంచ శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ సమాచార సొసైటీ దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య తీర్మానం ద్వారా ప్రకటించబడింది.2006, నవంబరులో టర్కీలోని అంటాల్యాలో జరిగిన అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ ప్లీనిపోటెన్షియరీ కాన్ఫరెన్స్ లో ఈ రెండింటిని కలిపి ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ టెలి కమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించబడింది.సుదూర ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గంచేలా కమ్యూనికేషన్‌ని వ్యాప్తి చేయడమే ఈ దినోత్సవం ముఖ్యోద్దేశం. మన జీవితంలో కమ్యూనికేషన్ ఎంత కీలకమైనదో అవగాహన పెంచడం, ఈ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిపరచడం వంటివి ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యాలు.

# లోకేష్ కు మద్దతుగా టీడీపీ ర్యాలీ

దర్శి ,నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రకాశం జిల్లా దర్శిలో టిడిపి శ్రేణులు భారీ ర్యాలీతో పాదయాత్ర చేపట్టి శుభాకాంక్షలు తెలిపారు. దర్శి మండలం శామంతిపూడి నుండి దర్శి లోని టిడిపి కార్యాలయం వరకు ఏడు కిలోమీటర్లు భారీ ర్యాలీతో పాదయాత్ర చేపట్టి నారా లోకేష్ కు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ... రాష్ట్రంలో లోకేష్ యువగళం పాదయాత్రతో వైసిపికి భయం పట్టుకుందన్నారు... దోచుకోవడం దాచుకోవడం తప్ప సీఎం జగన్ కు ఏమీ తెలియదు అన్నారు.. నవరత్నాలాంటూ మోసపూరిత వాగ్దానాలు చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు.బీసీ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఏమయ్యాయో చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు...కార్యక్రమంలో పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీ, చైర్మన్ పిచ్చయ్య టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

# ముగ్గురు చైన్ స్నాచర్స్ అరెస్ట్

కాకినాడ పెద్దాపురంలో ముగ్గురు చైన్ స్నాచర్స్ ను పోలీసులు అరెస్ట్ చేసారు. నిందితునుంచి సుమారు 8 లక్షల విలువైన 151 గ్రాముల బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం డిఎస్పీ లతా కుమారి నిందితుల వివరాలును మీడియాకు వెల్లడించారు. చైన్ స్నాచర్లను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ అబ్దుల్ నబీ, ఎసై వి.సురేష్, క్రైమ్ సిబ్బందిని అభినందించారు.

# మే 31 నుండి జూన్ 4వ తేదీ వరకు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు

తిరుపతి, మే 16తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు మే 31 వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగనున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీ అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహిస్తారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసార దుఃఖాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మం నుండి ఆవిర్భవించిన అలమేలు మంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం. మే 31వ తేదీ మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీ సుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. చివరి మూడు రోజుల పాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారికి జూన్ 3వ తేదీ రాత్రి 8 గంటలకు గజవాహనం, జూన్ 4వ తేదీ రాత్రి 8 గంటలకు గరుడ వాహనసేవ నిర్వహిస్తారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజు ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు.ఆర్జితసేవలు రద్దు : తెప్పోత్సవాల కారణంగా అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి లయన్స్ విజన్ కృషి

కాకినాడమహిళల నే కేంద్ర బిందువుగా చేసుకుని పలు కార్యక్రమాలను లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు లయన్ శ్రీదేవి రెడ్డి పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు నిత్యవసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు గాను కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తూ వందలాది మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వృద్ధాశ్రమంలో ప్రతినెల 100 కేజీల బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న మహిళలకు ప్రతినెల నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు శ్రీదేవి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాణి, మీనాక్షి ,న్యాయవాది యనమల రామం ,అడబాల రత్న ప్రసాద్, కే. ముని రెడ్డి, రవిశంకర్ పట్నాయక్, రేలంగి బాపిరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు

